క్లుప్తంగా

10న వీరశైవుల కార్తీక వన భోజనాలు

కర్నూలు(అర్బన్): వీరశైవ అభ్యుదయ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన పెద్దపాడు రోడ్డులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఏజీ మల్లికార్జునప్ప, జీఎస్ కాశీ విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఉసిరి చెట్టుకు పూజ, కోటి వత్తుల దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 10వ తరగతి, ఇంటర్, నీట్,ఎంసెట్‌లో ఉన్నత శ్రేణిలో (2023) ఉత్తీర్ణులైన వీర శైవ లింగాయతీ విద్యార్థులకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. అలాగే వీరశైవ మహిళలు, పురుషులు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

17న యాదవుల సమ్మేళనం

కర్నూలు(సెంట్రల్): ఈనెల 17వ తేదీన నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వర ఆలయ ఆవరణలో యాదవుల కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు జి.సోమన్నయాదవ్, జి.సదానంద యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘం కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. కార్తీక మాసం మానవాళికి పవిత్రమైన మాసమని, ఈ మాసంలో చన్నీటి స్నానం, జపం, ఉపవాసం, దానం, దీపారాధన అద్భుతమైన కార్యాలని చెప్పారు. ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే సర్వరోగాలు నయమవుతాయన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచి జగన్నాథగట్టుపైకి ఉచిత వాహన సదుపాయం కల్పిస్తామని, యాదవులందరూ కుటుంబసమేతంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

బెదిరింపులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బి.కరుణాకర్

కర్నూలు(సెంట్రల్): ఉచితంగా డప్పు కొట్టాలని కళాకారులను బెదిరించిన జి.సింగవరం సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. డప్పు కొట్టకపోతే పెన్షన్లను తొలగిస్తామని బెదిరించడం అన్యాయమన్నారు. సామరస్యంగా ప్రజలకు తెలియాల్సిన విషయాలపై డప్పు కొట్టాలని అడిగితే కళాకారులు కూడా సిద్ధంగా ఉంటారన్నారు. అలాగాకుండా దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడడం చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, రాజుకుమార్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికను శుభ్రం చేయాలి



కృష్ణానగర్ శ్మశానాన్ని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కృష్ణానగర్ శ్మశాన వాటికను శుభ్రంచేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ నాయకులు శ్మశాన వాటికను పరిశీలించారు. గుంతలుపడి కంపచెట్లు మొలచి వినియోగానికి పనికి రాకుండా ఉండడంతో అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే శ్మశాన వాటికను శుభ్రం చేయాలని కోరారు. మనిషి జీవితంలో బతికున్నాళ్లు ఎన్నో ఇబ్బందులు పడి జీవిస్తారని, చనిపోయిన సమయంలోనైనా వారికి సరైన విధంగా అంత్యక్రియలు చేసేందుకు శ్మశాన వాటికలను సంసిద్ధంగా ఉంచాలని కోరారు. నాయకులు రామకృష్ణ, అచ్చన్న, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, గోపి, రంగస్వామి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : లక్కీ భాస్కర్. అమరన్, అప్పుడో ఇప్పుడో ఎప్పుడో ,ధూం ధాం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : అమరన్, దేవర – 1, ధూం ధాం, అప్పుడో ఇప్పుడో ఎప్పుడో, రహస్యం ఇదం జగత్, జితేందర్ రెడ్డి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : లక్కీ భాస్కర్, అమరన్
శ్రీరామ : ఆదిపర్వం, జాతర
రాజ్ : బ్లడీ బెగ్గర్
భరత్ కాంప్లెక్స్ : ఆదిపర్వం, ఈసారైనా, జివెల్ థీఫ్ (బీవేర్ ఆఫ్ బర్గ్లర్)
విక్టరీ టాకీస్ : సింగం అగైన్

వైద్యరంగంలో అద్భుతం ఎక్స్‌రే

- ఆధునిక పద్ధతుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ఎక్స్‌రే నుంచి పెట్‌స్కాన్ వరకు అభివృద్ధి
- రేడియాలజిస్టులకు మంచి డిమాండ్
- పెద్దాసుపత్రిలో ఒకేచోట వైద్యపరీక్షలు
- నేడు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం



ఎంఆర్ఐ మిషన్



సీటీ స్కాన్



పెద్దాసుపత్రి రేడియాలజీ వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వెళ్లే ప్రతి ఒక్కరికీ ఎక్స్‌రే గురించి తెలిసి ఉంటుంది. ప్రస్తుత సమాజంలో ఎక్స్‌రేతో పాటు వచ్చిన ఆధునిక వ్యాధినిర్ధారణ పరీక్షల గురించి సైతం అవగాహన ఉంటుంది. తనకు ఫలానా పరీక్ష చేయాలని డాక్టర్‌ను అడిగే స్థితికి సగటు మనిషి చేరుకున్నాడు. ఆధునిక వైద్య విధానాలు సాధారణ మనిషి జీవితంలోనూ ఇంతగా వెళ్లిపోయిన పరిస్థితి ఇది. వ్యక్తి శరీరం లోపలి అవయవాలు, వాటి పనితీరు, అవి ఉన్న పరిస్థితిని చూడాలంటే ఎక్స్‌రే కిరణాలతో ఫొటో తీయాలి. ఈ అద్భుతం ఆవిష్కరణకు ఆద్యుడు ప్రొఫెసర్ డబ్ల్యూసీ రాంటిజెన్ అనే శాస్త్రవేత్త. 1895 నవంబర్ 8వ తేదీన ఆయన ఎక్స్‌రేను కనుగొన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు వైద్యరంగంలో వ్యాధినిర్ధారణ పరీక్షలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. ఎక్స్‌రే నుంచి ఫ్లోరోస్కోపి, ఎండోస్కోపి, కొలనోస్కోపి, అల్ట్రాసౌండ్ స్కానింగ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పెట్‌స్కాన్, డిజిటల్ రేడియోగ్రఫి, డీడీఆర్ వంటి ఆవిష్కరణలు జరిగాయి. ఎక్స్‌రే కనుగొన్న తేదిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 8న అంతర్జాతీ య రేడియాలజి దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.



రాంటిజెన్ శాస్త్రవేత్త

కర్నూలు మెడికల్ కళాశాలలో 1956లోనే రేడియాలజి విభాగం ఏర్పడింది. ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 8 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 30 మంది రేడియోగ్రాఫర్లు ఉన్నారు. వీరితో పాటు 20 మంది పీజీ వైద్య విద్యార్థులు, 25 మంది రేడియోగ్రఫి విద్యార్థులు ఇక్కడ అభ్యసిస్తూ రోగులకు సేవలందిస్తున్నారు. ఈ విభాగంలో ఒక ఎంఆర్ఐ, రెండు సీటీ స్కాన్ మిషన్లు, 16 అల్ట్రాసౌండ్ మిషన్లు, 12 ఎక్స్‌రే మిషన్లు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు 30 వేల ఎక్స్‌రేలు, 2 వేల దాకా డైరెక్ట్ డిజిటల్ రేడియోగ్రఫి, 250 వరకు ఫ్లోరోస్కోపి, 10 వేలకు పైగా అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు, 4,220 వరకు సీటీ స్కాన్ పరీక్షలు, 1125 వరకు ఎంఆర్ఐ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతమున్న 1.5 టెస్లా ఎంఆర్ఐ పరికరం ద్వారా కార్డియాక్ ఎంఆర్ఐ కూడా చేసుకునే వీలుంది. దీని ద్వారా గుండె రక్తనాళాలు, గుండె పనితీరు తెలుసుకునే వీలు కలుగుతుంది. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రెండు డైరెక్ట్ డిజిటల్ రేడియోగ్రఫి ద్వారా ఎక్స్‌రే ఫిల్మ్ తీయకుండానే నేరుగా క్యాజువాలిటి, ఏఎంసీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లోని వైద్యులు కంప్యూటర్‌లో చూసి వైద్యం అందించే ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని పరీక్షలు ఒకేచోట చేసే విధంగా రేడియో డయాగ్నోస్టిక్ సెంటర్ భవనం అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల రోగులు వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో అటూ ఇటూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

రేడియాలజీకి మంచి డిమాండ్

రేడియాలజీ పీజీ కోర్సుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సును ప్రైవేటులో అభ్యసించాలంటే ప్రస్తుతం రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో 60 మందికి పైగా రేడియాలజిస్టులు ఉన్నారు. ఎక్స్‌రేతో పాటు ఫ్లోరోస్కోపి, మామోగ్రాఫి, డైరెక్ట్ డిజిటల్ రేడియోగ్రాఫి, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ వంటి వైద్య పరీక్షలు వీరి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఈ పరీక్షల ద్వారా అతి సూక్ష్మ లోపాలను సైతం గుర్తించి రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వీలు కలుగుతుంది.

నేడు అంతర్జాతీయ రేడియాలజీ డే కార్యక్రమాలు



అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం పురస్కరించుకుని ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నాం. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ కూడా హాజరవుతున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం రేడియాలజీ విభాగం సేవలు మరింత విస్తరించాయి. ఎక్స్‌రే నుంచి ఎంఆర్ఐ స్కాన్ వరకు అన్ని రకాల వైద్యపరీక్షలు చేస్తున్నాం. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీస్కాన్, ఎంఆర్ఐ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నాయి. ప్రొఫెసర్ నుంచి పీజీ వరకు, సాంకేతిక సిబ్బంది అందరూ కలిసికట్టుగా రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ హరినాథ్, అసోసియేట్ ప్రొఫెసర్, రేడియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

అత్యాధునిక వైద్యపరీక్షలు



ఆసుపత్రిలోని రేడియాలజీ విభాగంలో అత్యాధునిక వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. డాక్టర్ అరుణ్‌కుమార్ అత్యాధునిక ప్రొసీజర్లు నిర్వహించడంలో మూడేళ్ల శిక్షణ తీసుకున్నారు. ఆయన నిర్వహించే ప్రొసీజర్లు రాష్ట్రంలో ఎక్కడా జరగడం లేదు. ఇవి బయట నిర్వహించాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. అలాంటిది ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తున్నాం. ఆపరేషన్ అవసరం లేకుండా రక్తనాళాల ద్వారా మందులు ఇచ్చే ప్రక్రియతో పాటు కణితుల సైజును తగ్గించే చికిత్స, తలలో రక్తనాళాలు బ్లాక్ అయిన వారికి థ్రాంబోలైటిస్ చికిత్స, సిటి గైడెడ్, అల్ట్రాసౌండ్ గైడెడ్ బయాప్సీ పరీక్షలు, కాన్పు అయినప్పుడు ఎక్కువ రక్తస్రావం జరుగుతుంటే దాన్ని ఆపేందుకు శరీరంపై కోత లేకుండా రక్తనాళం ద్వారా మందును ఎక్కించి రక్తస్రావాన్ని ఆపడం, పాంక్రియాస్ గ్రంధి వ్యాధి వల్ల దెబ్బతిన్న రక్తనాళాన్ని కాయిలింగ్ అనే పద్ధతి ద్వారా బాగు చేయడం వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ కె.రాధారాణి, ప్రొఫెసర్, రేడియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

స్ఫూర్తి గ్రంథం భగవద్గీత



విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న స్వామి అర్చనానంద, మల్లు వెంకట్‌రెడ్డి

కర్నూలు సిటీ: భగవద్గీతను ఆశ్రయిస్తే సకల సంపదలు చేకూరుతాయని, హృదయ దౌర్బల్యం దూరం చేస్తుందని, స్వామి వివేకానంద, బాల గంగాధర్ తిలక్, మహాత్మగాంధీ వంటి ఎందరో మహనీయులకు స్ఫూర్తినిచ్చిన గ్రంథమని రామకృష్ణ సేవాశ్రమం నిర్వాహకులు స్వామి అర్చనానంద అన్నారు. గురువారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత అనేక మంది గొప్ప వ్యక్తులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పురాణ కాలం నుంచి నేటి వరకు భగవద్గీతపై అనేక వ్యాఖ్యానాలు పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, వివేకానంద స్టడీ సర్కిల్ సమన్వయకర్త మాడుగుల నాగఫణి శాస్త్రి, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ కె.సురేష్‌కుమార్, వివేకానంద రామకృష్ణ భావ ప్రచార సమితి అధ్యక్షుడు డాక్టర్ శరత్ చంద్ర, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. గురువారం బ్యారేజీలోకి 6,910 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా ఒక గేటు పైకెత్తి 4446 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఎగువ నుంచి 10 వేల క్యూసెక్కులకుపైగా వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా.. మంచి ఆహారం తీసుకుంటూ, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ జయ ప్రకాష్ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి, రంగ నాయకులు క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీతారాంనగర్‌లోని అక్షరస్కూల్ ఆవరణలో గురువారం వయోవృద్ధులు, చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయ ప్రకాష్ మాట్లాడుతూ.. కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించగలగాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమస్యను పసిగట్టి వెంటనే వైద్యుడిని సంప్రదించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రంగనాయకులు మాట్లాడుతూ.. మనకు తెలియకుముందే బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ క్లబ్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, సభ్యులు విద్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

26న రైతు, కార్మిక సంఘాల మహాప్రదర్శన



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన మహాప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ భవన్‌లో గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీసీ, ఐఎస్‌టీయూసీ, ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల ప్రధాన కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతున్నాయని విమర్శించారు. అన్నదాతకు మద్దతధర లభించేలా చట్టం చేయాలని కోరితే కేంద్రం తిరస్కరిస్తోందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తేవడంతో బానిసలుగా బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26వ తేదీన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మహాప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



కర్నూలు పెద్దాసుపత్రిలో వార్డు బాయ్స్ లేకపోవడంతో రోగుల సహాయకులే స్ట్రెచర్, వీల్‌చైర్‌ను తోసుకెళ్తున్న దృశ్యాలు





తోసుకెళ్లాల్సిందే!

రాయలసీమకే తలమానికమైన కర్నూలు పెద్దాసుపత్రికి రోజుకు వందల సంఖ్యలో రోగులు వైద్యచికిత్సల నిమిత్తం వస్తుంటారు. డాక్టర్లు వారికి స్కానింగులు, ఎక్స్‌రే, రక్త పరీక్షలు రాస్తుంటారు. నడవలేని పరిస్థితిలో ఉన్న రోగులను వీల్ చైర్స్, స్ట్రెచర్స్‌లో వార్డు బాయ్స్ తీసుకెళ్లాలి. అయితే ఆసుపత్రిలో వార్డు బాయ్‌ల కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం స్పందించి వార్డు బాయ్స్‌ల నియామకానికి చర్యలు తీసుకోవాలి. లేకపోతే పరిస్థితి ఇలాగే కొనసాగి రోగులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

15న లక్ష దీపోత్సవం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు నగరంలోని లలితా పీఠంలో నవంబర్ 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు లక్ష దీపోత్సవంతో పాటు 8 గంటలకు అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 4 గంటలకు శివపార్వతుల కళ్యాణం, 5 గంటలకు సామూహిక ఉచిత శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ మద్యం పట్టివేత

- 51 మద్యం బాటిళ్ల సీజ్ ● ఒకరి అరెస్ట్

కర్నూలు (టౌన్): కర్నూలు శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తెలంగాణ నుంచి కర్నూలు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ సోదాల్లో 51 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితుడు కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు (సిటీ): కేజీబీవీలోని బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి వెరిఫికేషన్ చేయనున్నట్లు డీఈఓ శామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కమిటీ ద్వారా వెరిఫికేషన్ చేసిన తర్వాత తయారు చేసిన ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందన్నా రు. ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరైన ఆధారాలతో డీఈఓ ఆఫీస్ పైన ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో నేడు, రేపు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ చేయించుకుని ఏవైనా తప్పులు ఉంటే సరి చేయించుకోవాలని ఆయన సూచించారు.

బాలాజీ నగర్‌లో చైన్‌స్నాచింగ్

కర్నూలు (రూరల్) : బాలాజీ నగర్ ఉర్దూ స్కూల్ సమీపాన వృద్ధురాలు సరస్వతమ్మ బంగారం గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. గురువారం తెల్లవారుజామున ఇంటి ఎదుట శుభ్రం చేసి పూజకు పూలు తెచ్చుకుంటుండగా ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి రెండున్నర తులాల బంగారం గొలుసును లాక్కుని ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ పీరయ్య తెలిపారు.

యురేనియం తవ్వకాలు తక్షణమే ఆపాలి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్
- 11న కలెక్టరేట్ ఎదుట నిరసనకు పిలుపు



మాట్లాడుతున్న రవీంద్ర శర్మ

కర్నూలు(సెంట్రల్): కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో చేపట్టబోయే యురేనియం నిక్షేపాల గుర్తింపు, తవ్వకాల ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రవీంద్ర శర్మ డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యురేనియం కోసం తవ్వకాలు జరిపితే దాని చుట్టుపక్కల 100 కిలోమీటర్ల వరకు దాని ప్రభావం పడుతుందన్నారు. కప్పట్రాళ్ల, పి.కోటకొండ, జిల్లెదుబుడకల, బేతపల్లి, చల్లచలిమల, బంటుపల్లి, వెంకటాపురం, గుడిమిరాళ్ల, గుండ్లకొండ, కరివేముల, దేవనకొండ తదితర ప్రాంతాలపై ఆ ప్రభావం పడుతుందన్నారు. తద్వారా అక్కడి ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. యురేనియం పరిశీలనకు 68 బోర్లకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో గైనిక్ వైద్యుల సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో ఈ నెల 9, 10 తేదీల్లో ఫెడరేషన్ ఆఫ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ డాక్టర్ వి.రాధాలక్ష్మి చెప్పారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియం, ఎగ్జామినేషన్ హాల్, న్యూ లెక్చరర్ గ్యాలరీల్లో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. నగరంలోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో హిస్ట్రోస్కోపిపై వర్క్‌షాప్, మెడికల్ కాలేజీలో అల్ట్రాసౌండ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నామన్నారు. అల్ట్రాసౌండ్ గురించి డాక్టర్ మమత దీన్‌దయాల్, డాక్టర్ టీఎల్ఎన్ ప్రవీణ్, హిస్ట్రోస్కోపి గురించి డాక్టర్ సుభాష్‌మాల్యా, డాక్టర్ రామకృష్ణహనుమ వివరిస్తారన్నారు. కార్యక్రమానికి వరల్డ్ గైనిక్ సొసైటీ ట్రెజరర్ డాక్టర్ శాంతకుమారి, ఆలిండియా గైనిక్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ మాధవీపటేల్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నిర్మలాదేవి, గుజరాత్ నుంచి డాక్టర్ ఎంసీ పటేల్ హాజరవుతున్నారన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో 26 లెక్చర్లపై నేషనల్, స్టేట్‌లెవెల్‌కు చెందిన స్పీకర్లు ప్రసంగిస్తారన్నారు. వీటితో పాటు 110 పేపర్ ప్రెజెంటేషన్లు, రోగులకు సంబంధించి లైవ్ ఎగ్జామినేషన్లు జరుగుతాయని వివరించారు. సమావేశంలో ట్రెజరర్ డాక్టర్ పి. మమత, డాక్టర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

లిఫ్ట్ పనిచేయక రోగుల ఇబ్బందులు



పెద్దాసుపత్రిలో పనిచేయని లిఫ్ట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాలిటీ నుంచి అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే లిఫ్ట్ మూడు రోజులుగా పనిచేయడం లేదు. ఈ విషయం తెలిసినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. మరోవైపు లిఫ్ట్ పనిచేయకపోవడం వల్ల రోగులు, వారి సహాయకులు, కార్యాలయానికి వెళ్లే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ బ్లాక్‌లోని భవనంలో కింద క్యాజువాలిటీ, మొదటి అంతస్తులో ఏఎంసీ, మానసిక వ్యాధులు, ఈఎన్‌టీ, దంత వైద్యం, చర్మవ్యాధుల ఓపీ, రెండో అంతస్తులో కార్యాలయం నిర్వహిస్తున్నారు. లిఫ్ట్ పనిచేయకపోవడంతో ప్రతిరోజూ ఎత్తైన భవనం ఎక్కేందుకు ప్రతిఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్ట్‌ను బాగు చేయించాలని రోగులు, వారి సహాయకులు, దివ్యాంగులు కోరుతున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలపై అవగాహన



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న రవీంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల పట్ల పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వీ.రవీంద్రారెడ్డి సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో డోన్, నందికొట్కూరు, బనగానపల్లె నియోజకవర్గాల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సీసీ రోడ్ల నిర్మాణాలు, నాణ్యతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు సిమెంట్, ఇసుక, మెటల్‌ను నిర్దేశించిన మేరకు మాత్రమే మిక్స్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే రోడ్ల నిర్మాణాల్లో కచ్చితంగా వైబ్రేటర్లు పెట్టాలని, రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత కచ్చితంగా 21 రోజులు వాటర్‌తో క్యూరింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేసే సమయంలో ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలని సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఇసుక, సిమెంట్, మెటల్ వినియోగిస్తే నాణ్యత లోపించి, రోడ్లు ఎక్కువ కాలం మన్నికగా ఉండవని చెప్పారు. ముఖ్యంగా ఉపాధి కూలీల వేతనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ, ఏఈలు కే.విజయ భాస్కర్, హెచ్.అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎస్టిమేట్స్ ఎలా వేయాలి, ఎం బుక్ ఎలా రికార్డు చేయాలి, క్వాంటిటీ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, నంద్యాల ఇన్‌చార్జ్ ఎస్ఈ కే.నాగరాజు, పీఐయు ఈఈ రఘురామిరెడ్డితో పాటు ఆయా సబ్ డివిజన్లకు చెందిన డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.